క్లుప్తంగా

జిల్లా సీపీసీగా 'మాలే'



మలికిపురం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కన్స్యూమర్ ప్రొటెక్ట్ కౌన్సిల్ (సీపీసీ) మెంబరుగా మాలే శ్రీనివాస నగేష్ నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ మహేష్‌కుమార్ నుంచి నియామక ఉత్తర్వు అందిందని బుధవారం మాలే విలేకరులకు తెలిపారు. ప్రస్తుతం జిల్లా కోకోఫెడ్ ఉపాధ్యక్షుడిగా, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల వినియోగదారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడిగా శ్రీనివాస్ బాధ్యలు నిర్వహిస్తున్నారు. వినియోగదారులు వివిధ సంస్థల ద్వారా నష్టపోకుండా ఉండటానికి వినియోగదారుల రక్షణ చట్టం కవచంగా ఉందని, వినియోగదారుల హక్కులు, రక్షణ కోసం పనిచేస్తానని ఆయన అన్నారు.

పంచాయతీరాజ్ డీఈఈగా కృష్ణంరాజు



రాజోలు: రాజోలు సబ్ డివిజన్ పంచాయతీరాజ్ డీఈఈగా కేవీ కృష్ణంరాజు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. మామిడికుదురు మండల ఏఈగా విధులు నిర్వహిస్తున్న కృష్ణంరాజు పదోన్నతిపై డీఈఈ రాజోలు సబ్ డివిజన్‌కు బదిలీ అయ్యారు. డీఈఈగా బాధ్యతలు చేపట్టిన కృష్ణంరాజును కార్యాలయ సిబ్బంది మర్యాదపూర్వకంగా కలసి స్వాగతం పలికారు.

సికిల్‌సెల్ ఎనీమియా నియంత్రణకు పరీక్షలు

ఆలమూరు: మండలంలోని వివిధ గ్రామాల్లో వైద్య ఆరోగ్య సిబ్బంది బుధవారం సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేశారు. జిల్లా వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు పెదపళ్ల, చొప్పెల్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు డి.సాయికిషోర్, ఎన్.లక్ష్మీస్నేహ నేతృత్వంలో ఆరోగ్య, ఆశ సిబ్బంది వలస కార్మికులు నివసిస్తున్న పెదపళ్ల, పినపళ్ల, సంధిపూడి, ఆలమూరు, జొన్నాడ గ్రామాల్లో ఈ పరీక్షలు నిర్వహించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలనకు తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి వంశ పారంపర్యంగా సంభవించే అవకాశం ఉందని వివరించారు. ఈ వ్యాధి సోకిన వారికి శరీరంలోని ఎర్ర రక్త కణాలు కొడవలి ఆకారంలో మారడం వల్ల రక్తనాళాల్లో రక్త ప్రసరణ తగ్గుతుందన్నారు. దీనివల్ల శరీరంలో భరించలేని నొప్పులు ఎక్కువ అవుతాయని తెలిపారు. సీహెచ్‌ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా అక్కుల, బి.సూర్యనారాయణ, సీహెచ్ఓ ఎంఎస్ఎన్ రెడ్డి, హెల్త్ సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి తదితరులు పాల్గొన్నారు.


తిరుమలేశునికి గజ వాహన సేవ



కూచిపూడి నృత్యం చేసిన విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న చింతపట్ల బాబు

అమలాపురం రూరల్: బండారులంక బిళ్లవారి వీధిలో కొలువైన పద్మావతి, అలివేలు మంగా సమేత వేంకటేశ్వరస్వామివారి కల్యాణ మహోత్సవాల్లో భాగంగా బుధవారం ప్రత్యేకంగా అలంకరించిన గజ వాహనంపై స్వామి, అమ్మవార్లను ఊరేగించారు. దారి పొడవునా మహిళలు మంగళ హారతులు ఇచ్చారు. ఈ వాహన సేవలో మడావారి వీధి యూత్ పాల్గొన్నారు. తొలుత ఆలయ అర్చకుడు బీరక భీమేశ్వరరావు అర్చకత్వంలో బిళ్ల విశ్వేశ్వర రావు, లక్ష్మీకుమారి దంపతులు విశేష పూజలు, అభిషేకాలు చేశారు. అలాగే మంగళవారం రాత్రి 50 మంది చిన్నారులు నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన విశేషంగా ఆకట్టుకుంది. కార్యక్రమంలో శ్రీనివాసా బాలమిత్ర సంఘ ప్రతినిధులు చింతపట్ల బాబు, పిచ్చుక మోహన్, బళ్ల సాయి పాల్గొన్నారు.

సాన్వీని అభినందించిన డీఈవో



సాన్వీని అభినందిస్తున్న డీఈవో సలీం బాషా

అమలాపురం రూరల్: ఇటీవల గుంటూరులో జరిగిన అండర్ – 7 స్టేట్ చెస్ చాంపియన్‌షిప్‌లో రాష్ట్ర స్థాయిలో రెండో స్థానం సాధించిన సాన్వీని డీఈవో సలీం బాషా అభినందించారు. అలాగే జాతీయ సాయి చదరంగ పోటీలకు ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమని కొనియాడారు. ఏడేళ్ల సాన్వీ ఎంతో మంది చిన్నారులకు స్ఫూర్తిదాయకమన్నారు. అలాగే పాఠశాల చైర్మన్ నంద్యాల నాయుడు, పాఠశాల డైరెక్టర్ల నంద్యాల మనువిహార్, స్నేహ ప్రియ, ప్రిన్సిపాల్ దేవి దీక్షిత్, కోచ్‌లు వి.శ్రీను,కె.రాజు అభినందించారు.

ప్రతిపాదనలకే పరిమితం

- ప్రమాదకరంగా శిథిల వంతెనలు
- పెరిగిన రద్దీ
- భయం భయంగా ప్రయాణం



వేపచెట్టు డ్రైన్‌పై శిథిలమైన మూలపోదు వంతెన

మలికిపురం: వేప చెట్టు ప్రధాన మీడియం డ్రైన్‌పై శిథిల స్థితిలో ఉన్న పలు వంతెనల పునర్నిర్మాణం ప్రతిపాదనలకే పరిమితమయ్యాయి. రాజోలు నియోజకవర్గంలో ప్రధాన వ్యవసాయ డ్రైన్లలో రెండో అతి పెద్ద డ్రైన్‌గా ఉన్న వేప చెట్టు మీడియం డ్రైన్‌లో ముగురునీటి పారుదల అంతంత మాత్రంగా ఉండడంతో పాటు ఆ డ్రైన్‌పై గల పలు వంతెనలు కూడా శిథిల స్థితికి చేరుకుని అభివృద్ధికి నోచుకోవడం లేదు. ఇందుకోసం ప్రభుత్వం శ్రద్ధ తీసుకోవడం లేదు. శివకోడు, చింతలపల్లి, దిండి, మేడిచర్లపాలెం, గుడిమెళ్లంక, విశ్వేశ్వరాయపురం, లక్కవరం, మలికిపురం, అప్పన రామునిలంక, సఖినేటిపల్లి గ్రామాల్లో విస్తరించి ఉన్న ఈ డ్రైన్‌పై అనేక వంతెనలు పదిహేనేళ్ల క్రితమే శిథిల స్థితికి చేరుకున్నాయి. వాటి స్థానంలో కొత్త వంతెనలు నిర్మించాలని ప్రజల నుంచి వినతి పత్రాలు వెళ్లినా కనీసం అంచనాలు వేసి ప్రతిపాదనలు రూపొందించిన దాఖలాలు కూడా ప్రభుత్వం వద్ద లేదు. దీంతో గత పదిహేనేళ్లగా ఆ శిథిల వంతెనలపై ప్రజలు అత్యంత ప్రమాదకర ప్రయాణాలు సాగిస్తున్నారు. సాధారణ మోటార్ సైకిళ్లతో పాటు, ఆటోలు, చిన్న కార్లు, లారీలు, స్కూల్ బస్సులు, ఆర్టీసీ బస్సులు కూడా అలాగే రాకపోకలు సాగిస్తున్నాయి. మలికిపురం నుంచి గుడిమెళ్లంక, మూలపోడుకు వెళ్లే రోడ్డులో వేప చెట్టు డ్రైన్‌పై ఉన్న బల్లవంతెన శిథిలస్థితికి చేరుకుంది. సుమారు 35 ఏళ్ల క్రితం నిర్మించిన ఈ వంతెన శిథిలమై ప్రమాదకరంగా ఉన్నప్పటికీ పునర్నిర్మాణానికి నోచుకోవడం లేదు. వంతెన ఇరువైపులా రోడ్డు మెరక కావడంతో వర్షపు నీళ్లు నిలిచిపోయి, వంతెనపై గోతులు పడ్డాయి. దీంతో ప్రయాణానికి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే వంతెన ఇరుకుగా ఉండడంతో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. వంతెన కింది భాగంలో శ్లాబ్ కూడా శిథిలమై ప్రమాదకరంగా ఉంది. అయినా రాకపోకలు సాగుతున్నాయి. పునర్నిర్మాణాన్ని అధికారులు పట్టించుకోవడం లేదు. అలాగే అయ్యవారితిప్ప నుంచి విశ్వేశ్వరాయపురం వచ్చే రోడ్డులో ఇదే డ్రైన్ ఉన్న వంతెన కూడా శిథిల స్థితిలో ఉంది. సత్యజ్యోతి థియేటర్ వద్ద కూడా ఇదే డ్రైన్‌పై గల వంతెన కూడా కూలేందుకు సిద్ధంగా ఉంది. ఈ డ్రైన్‌పై గుడిమెళ్లంక ఆర్అండ్‌బీ రోడ్డులోని వంతెనలో సగ భాగం పదేళ్ల క్రితం నిర్మించారు. మరో సగభాగం సుమారు 40 ఏళ్ల క్రితం నిర్మాణం జరిగింది. అది కూడా శిథిలస్థితికి చేరింది. లక్కవరంలో ఆర్అండ్‌బీ రోడ్డుకు ఈ డ్రైన్‌పై గల కల్వర్టు కూడా శిథిల స్థితిలో ఉంది. ఇక్కడ గత ఏడాది కల్వర్టు కూలినా తాత్కాలిక మరమ్మతులు చేశారు తప్ప శాశ్వత పనులు చేపట్టలేదు. ఈ డ్రైన్‌పై అధిక శాతం వంతెనలపై వ్యవసాయ ఉత్పత్తుల రవాణా అధికంగా జరుగుతుంది. సార్వా, దాళ్వా సమయంలలో యంత్ర పరికరాల, ఎరువుల రవాణాతో పాటు ధాన్యం కొబ్బరి ఉత్పత్తులు అధికంగా రవాణా ఉంటుంది. ఇటీవల 216 జాతీయ రహదారి అందుబాటులోకి రావడంతో ఈ వంతెనల పరిధిలోని రహదారులు కూడా ఆర్అండ్‌బీకి బదిలీ అయ్యాయి. అయితే ఈ వంతెనలు మాత్రం అటు డ్రైనేజీ పరిధిలో ఉండి నిధులు లేక నిర్మాణానికి నోచడం లేదు. ఇంతటి ప్రాధాన్యం ఉన్న వంతెనలపై ప్రభుత్వం పూర్తి ఉదాసీనంగా వ్యవహరించడంపై ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

తక్షణం వంతెనల నిర్మాణం చేపట్టాలి



వేప చెట్టు డ్రైన్‌పై మూలపోడు, గుడిమెళ్లంక, లక్కవరం తదితర చోట్ల గల శిథిల వంతెనల స్థానంలో కొత్త వంతెనల నిర్మానం చేపట్టాలి. అనేక ఏళ్లుగా ఈ వంతెనలు శిథిల స్థితిలో ఉన్నాయి. ఇవి ఏ క్షణాన్నయినా కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. ప్రభుత్వం ప్రత్యేకశ్రద్ధ వహించాలి. వెంటనే నిధులు కేటాయించాలి.

– బూశి జాన్‌మోసే,
సామాజిక కార్యకర్త, విశ్వేశ్వరాయపురం

నిధులు లేకే నిర్మించలేదు



రాజోలు నియోజకవర్గంలో చాలా ప్రాంతాల నుంచి ప్రజలు, ప్రజా ప్రతినిధులు వంతెనలు నిర్మించాలని కోరుతున్నారు. అయితే ప్రస్తుతం నిధులు లేక డ్రైన్స్ గానీ, వాటిపై వంతెనలు గానీ నిర్మించలేకపోతున్నాం. ప్రభుత్వం అంచనాలు కోరితే తయారు చేసి పంపుతాం.

– ఆర్.నాగార్జునరావు,
డీఈ, డ్రైనేజీ శాఖ, రాజోలు

బ్రహ్మయ్య సేవలు మరువలేనివి



బ్రహ్మయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించిన మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు

మలికిపురం: వైఎస్సార్ సీపీకి గూడపల్లి సర్పంచ్ దివంగత సుందర బ్రహ్మయ్య (తాతాజీ) అందించిన సేవలు మరువలేనివని మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు అన్నారు. ఇటీవల మృతి చెందిన బ్రహ్మయ్య కుటుంబ సభ్యులను గురువారం ఆయన పరామర్శించి ఓదార్చారు. బ్రహ్మయ్య చిత్ర పటం వద్ద నివాళులర్పించారు. పార్టీని గ్రామంలో బలోపేతం చేసి అందరితో ఐకమత్యంగా ఉండి మంచి నేతగా గుర్తింపు పొందారని పేర్కొన్నారు. ఆయన వెంట మండల పార్టీ అధ్యక్షులు అడబాల వీర బ్రహ్మాజీరావు, అడబాల జానకీరామ్, పార్టీ నాయకులు ఉన్నారు.

రేపు అయినవిల్లిలో సంకష్టహర చతుర్థి పూజలు

అయినవిల్లి: అయినవిల్లి విఘ్నేశ్వస్వామివారి సన్నిధిలో శుక్రవారం సంకష్టహర చతుర్థి పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ ఈఓ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ముదునూరి సత్యనారాయణరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. స్వామివారి విశేష పూజల్లో భక్తులకు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు. సంకష్టహర చతుర్థి పూజల్లో పాల్గొనే భక్తులకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.

పుష్కర ఘాట్ల అభివృద్ధికి ప్రణాళిక



దిండిలో పుష్కరఘాట్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్

మలికిపురం: 2027లో జరగబోయే పుష్కరాలను దృష్టిలో ఉంచుకొని నియోజకవర్గంలో అన్ని పుష్కర ఘాట్లను అభివృద్ధి చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ పేర్కొన్నారు. మలికిపురం మండలం దిండి, రామరాజులంక పుష్కర్ ఘాట్‌లను అధికారులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు.

ఘాట్‌ల విస్తీర్ణం పెంచడం, మౌలిక వసతులు మెరుగు పరచడం, రోడ్ల నిర్మాణం తదితర అంశాలపై అధికారులతో చర్చించారు. ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ఈ ఘాట్ ల పరిశీలనలో ప్రాజెక్టు కమిటీ చైర్మన్ గుబ్బల శ్రీనివాస్, పినిశెట్టి బుజ్జి, చాగంటి స్వామి, అడబాల యుగంధర్, దిరిశాల బాలాజీ, సర్పంచ్ ముదునూరి శ్రీనివాసరాజు, ఎన్డీఏ కూటమి నాయకులు, సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

డిజిటల్ అసిస్టెంట్లకు పదోన్నతి



గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతులు పొందిన డిజిటల్ అసిస్టెంట్లు

ఆలమూరు: వివిధ గ్రామాల్లో డిజిటల్ అసిస్టెంట్లుగా పనిచేస్తున్న నలుగురికి గ్రేడ్-5 కార్యదర్శులుగా పదోన్నతి లభించింది. కాకినాడలోని జిల్లా పరిషత్ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లకు బుధవారం కౌన్సెలింగ్ జరిగింది. అందులో భాగంగా బడుగువానిలంక గ్రామ సచివాలయంలో గ్రేడ్-6 కార్యదర్శిగా పనిచేస్తున్న శివకుమార్ మడికి సచివాలయం-2కు, జొన్నాడ సచివాలయం-1లో పనిచేసే గుత్తుల అమృతవర్షిణిని రావులపాలెం సచివాలయం-4కు, నర్సిపూడి సచివాలయం-1లో పనిచేసే హేమంత్‌కుమార్‌ను మూలస్థానం-2కు, చొప్పెల్ల-1లో పనిచేసే ప్రసన్నకుమార్‌ను ఆత్రేయపురం మండలం పులిదిండి సచివాలయానికి నియమించారు. ఇటీవల మండలంలో పనిచేసిన గ్రేడ్-5 కార్యదర్శులను గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతులు పొందారు. గ్రామ కార్యదర్శులుగా నియమితులైన వారిని ఎంపీపీ టి.లక్ష్మణరావు, జెడ్పీటీసీ టి.సీతామహాలక్ష్మి, ఎంపీడీఓ అభినందించారు.

ఘనంగా అన్నమయ్య జయంత్యుత్సవాలు

అమలాపురం టౌన్: సంస్కార భారతి జిల్లా శాఖ ఆధ్వర్యంలో తాళ్లపాక అన్నమయ్య జయంతి ఉత్సవాలు స్థానిక సుభద్ర నర్సింగ్ హోమ్ వద్ద బుధవారం జరిగాయి. ఈ సందర్భంగా డాక్టర్ అయ్యగారి రాధిక చేసిన వీణాగానం ఆహూతులను అలరించింది. సంస్కార భారతి ప్రతినిధి శ్రీగిరి పద్మావతి అధ్యక్షతన జరిగిన ఈ జయంతి ఉత్సవంలో తొలుత అన్నమయ్య చిత్ర పటానికి పూలమాలలు వేసి నమస్సుమాంజలి ఘటించారు. అన్నమయ్య కీర్తనలను నాగ కమల లయబద్ధంగా ఆలపించి రంజింపచేశారు. అలాగే సంగీతం మాస్టారు మట్టపర్తి చంద్రశేఖర్ కూడా అన్నమయ్య కీర్తనలు ఆలపించారు. చిన్నారి లహరి ఆలపించిన కీర్తనలు అందిరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం సంగీత కళాకారులను సంస్కార భారతి ప్రతినిధులు సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు. సంస్కార భారతి ప్రతినిధులు వీవీఆర్ నాయుడు, వేదనభట్ల సాయిలక్ష్మి, యెందూరి సీతామహాలక్ష్మి, పేరి లక్ష్మీనరసింహం, నూకల సత్యనారాయణ, భమిడపాటి సుగుణేశ్వరి, కూచిమంచి వెంకటరాజు పాల్గొన్నారు.



సంగీత కళాకారులను సత్కరిస్తున్న సంస్కార భారతి జిల్లా శాఖ ప్రతినిధులు

స్వర్ణ పంచాయతీని పూర్తి స్థాయిలో చేపట్టాలి



అంబాజీపేటలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న డీపీఓ శాంతలక్ష్మి

అంబాజీపేట: స్వర్ణ పంచాయతీ కార్యక్రమాన్ని డోర్ టు డోర్ తిరుగుతూ చెత్తను సేకరించేలా పూర్తి స్థాయిలో చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని డీపీఓ డి.శాంతలక్ష్మి అన్నారు. అంబాజీపేట మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ వై.భీమారావు అధ్యక్షతన పి.గన్నవరం నియోజకవర్గ పంచాయతీ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. డీపీఓ శాంతలక్ష్మి మాట్లాడుతూ చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాలను సిద్ధం చేసి వాటిని అమలులోకి తీసుకురావాలన్నారు. అలాగే వాటిలో నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారు చేయడం, వాటి అమ్మకాల ద్వారా పంచాయతీలకు ఆదాయం సమకూర్చుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. డంపింగ్ యార్డులు ఉన్న గ్రామాల్లో చెత్త నుంచి సంపదను సృష్టించేలా చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. ఇంటి పన్నులు నూటికి నూరు శాతం వసూలు చేయాలన్నారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని తాగునీటి సమస్య ఉన్న గ్రామాల్లో తాగునీటిని సరఫరా చేయాలన్నారు. సమావేశంలో డీఎల్పీవో బొజ్జిరాజు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వేగంగా ఉపాధి పనులు పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఏపీడీ మల్లికార్జునరావు

రాజోలు: గ్రామాల్లో చేపడుతున్న ఉపాధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని పి.గన్నవరం క్లస్టర్ ఏపీడీ మల్లికార్జునరావు అన్నారు. బుధవారం రాజోలు మండల పరిషత్ కార్యాలయంలోని పి.గన్నవరం క్లస్టర్ పరిధిలోని రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, మామిడికుదురు, పి.గన్నవరం మండలాలకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. కొన్ని గ్రామాల్లో ఉపాధి పనులు చాలా తక్కువగా చేస్తున్నారన్నారు. పని రోజులు, కూలీల సంఖ్య లక్ష్యాలను అధిగమించాలన్నారు. కూలీలకు గ్రామాల్లో సరైన పనులు కల్పించాలన్నారు. సీబీ కవిత, ప్లాంటేషన్ మేనేజర్ త్రినాథ్, ఏపీఓలు, ఈసీలు, జేఈలు, టెక్నికల్ అసిస్టెంట్లు, కంప్యూటర్ ఆపరేటర్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

వేధిస్తున్న ఎండుగడ్డి కొరత



గుమ్మిలేరులో కొనుగోలు చేసిన ఎండుగడ్డిని ట్రాక్టర్‌పై తరలిస్తున్న రైతులు

- ట్రాక్టర్ గడ్డి రూ.పది వేలు పైమాటే
- రూ.35 పలుకుతున్న మోపు గడ్డి

ఆలమూరు: ప్రకృతి వైపరీత్యాలు.. ఆధునిక యాంత్రీకరణ.. మూగ జీవాల జీవన విధానంపై తీవ్ర ప్రభావం చూపుతుంది. దీనివల్ల పాడి పరిశ్రమ అభివృద్ధికి అనేక ఆటంకాలు ఎదురుకావడంతో పశుగ్రాసం కొరత ఏర్పడి రోజు రోజుకూ పశువులను పెంచే వారి సంఖ్య తగ్గిపోతుంది. పాడి పశువుల పోషణకు, అధిక పాల దిగుబడికి మేలైన, మెరుగైన దాణాగా ప్రసిద్ధి గాంచిన ఎండుగడ్డి సామాన్య పాడి రైతులకు అందని ద్రాక్షగా మారింది. వ్యవసాయ విధానం ఆధునీకరణ దిశగా పయనించడంతో పాటు రైతులు తమకు కూలీ ఖర్చులు ఆదా అవుతున్నాయంటూ వరికోత యంత్రాలకు ప్రాధాన్యం ఇవ్వడం ఎండు గడ్డి కొరత సమస్య ఏటా మరింత జటిలంగా మారుతుంది. వరి కోత యంత్రాలను వినియోగితంచి కోతలు కోయడం వల్ల ఆ గడ్డి నిరుపయోగంగా మారుతుంది. గడచిన మూడు దశాబ్దాలుగా ఎన్నడూ లేని విధంగా వేసవిలో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు రావడంతో కొంత మంది రైతులు సేకరించుకున్న ఎండుగడ్డి తీవ్రంగా దెబ్బతింది. దీనికి తోడు అధిక సంఖ్యలో రైతులు వరి కోత యంత్రాలను ఆశ్రయించడం వల్ల ప్రతి సీజన్‌లో ఎండు గడ్డి కొరత తీవ్రత నానాటికి అధికమవుతుంది. దీంతో స్థానిక పాడి రైతులు సమీపంలోని చాగల్నాడు, మెట్ట ప్రాంతాల నుంచి ఎకరం గడ్డిని అధిక ధరకు కొనుగోలు చేసి తీసుకువస్తున్నారు. దీనికి మళ్లీ రవాణా, ఎగుమతి, దిగుమతులు, కూలీల ఖర్చుతో కలిపి రూ.ఆరు వేలు ట్రాక్టర్ గడ్డి ఇంటికి తీసుకువచ్చేసరికి రూ.10 వేల వరకూ అవుతుంది.

ఎండు గడ్డికి భలే డిమాండ్

గతంలో ఖరీఫ్‌లో లభించే ఎండుగడ్డిని పాడి రైతులకు పశుగ్రాసంగా ఏడాది పొడవునా వినియోగించేవారు. మారిన పరిస్థితుల కారణంగా ఖరీఫ్ సీజన్‌లోనూ యంత్రాల సాయంతో కోతలు కోయడంతో గడ్డి అంతంత మాత్రంగానే దొరుకుతుంది. దీంతో రబీ సీజన్‌లో కూడా ఎండుగడ్డిని సేకరించి పశువులకు దాణాగా రైతులు వేస్తున్నారు. కూలీలతో కోత కోసేందుకు అవకాశం లేకపోవడంతో యంత్రాలను ఆశ్రయించక తప్పని పరిస్థితి పాడిరైతుల్లో నెలకొంది. కొత్తపేట, రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గంలోని 11 మండలాల్లో సుమారు 58 వేల ఎకరాల్లో వరిసాగు చేపట్టగా దాదాపు 45 వేల వేల ఎకరాల్లోని పంటను యంత్రాలతోనే కోశారు. అయితే పంట పొలాల్లో కోసిన ఎండుగడ్డిని వృథా పోకుండా మహిళ కూలీలు సేకరణ జరుపుకొంటూ పాడి గ్రాసం కోసం ఆరాట పడుతున్నారు.

గడ్డి సేకరణ యంత్రాలతో మేలు

ఇటీవల కాలంలో అందుబాటులోకి వచ్చిన గడ్డి కోత యంత్రం (స్ట్రాబేలర్)తో కొంత మంది రైతులు గడ్డిని సేకరిస్తున్నారు. ఈ విధంగా సేకరించి గడ్డి మోపు ధర రూ.35 వరకూ పలుకుతుంది. అంత ధర వెచ్చించి ఎండుగడ్డి కొనుగోలు చేసే స్తోమత లేని పేద పాడి రైతులు వరికోత యంత్రాలతో కోసిన పొలాలకు వెళ్లి ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ఆ గడ్డిని పదిలంగా చేసుకుని పశువులకు పెడుతున్నారు. గతంలో అయితే పట్టించుకోని ఆ గడ్డి పరకను నేడు బంగారంలా చూస్తున్నారు. అలాగే పంట పొలాల్లో వదిలేసిన గడ్డిని కొంతమంది కూలీలు సేకరించి పశువుల దాణాకు ఉపయోగించుకుంటున్నారు.



ఎండుగడ్డిని సేకరిస్తున్న మహిళా కూలీలు

యంత్రాలతో గడ్డిని సేకరించాలి

వరికోత యంత్రాల ద్వారా కోసిన పొలాల్లో వదిలేసిన గడ్డిని యంత్రాల ద్వారా సేకరించే పశుగ్రాసం కొరతను అధిగమించవచ్చు. అలాగే కూలీల ద్వారా పొలాల్లో గడ్డిని ఒక చోట చేర్చి మోపులుగా కట్టి నిల్వ చేసుకోవాలి. ఎండుగడ్డిని దాణాగా ఉపయోగిచడం వల్ల పశువులకు మెరుగైన ఆరోగ్యం పొంది అధిక పాల దిగుబడిని అందిస్తుంది.

– సుభాష్, పశు వైద్యాధికారి, గుమ్మిలేరు.

మీ పిల్లలకు.. ప్రభుత్వ పాఠశాల ఉంది మీ చెంత...



కొత్తపేట మండలం అవిడి గ్రామంలో ఇంటింటా తల్లిదండ్రులను కలుస్తున్న ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్

- ప్రభుత్వ విద్యా ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోండి
- అవిడిలో ప్రభుత్వ ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ వినూత్న ప్రచారం

కొత్తపేట: మీకు, మీ పిల్లలకు దూరం, భారం లేని ప్రభుత్వ పాఠశాల ఉంది మీ చెంత.. పిల్లల తల్లిదండ్రులూ ఆర్థిక భారం మోయొద్దు.. ప్రభుత్వ పాఠశాలే ముద్దు.. అమ్మా.. అయ్యా.. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించండి.. ప్రభుత్వ ప్రోత్సాహకాలు సద్వినియోగం చేసుకోండి.. అంటూ ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడు ఇంటింటా, మోటార్ సైకిల్‌పై మైకుతో వినూత్న ప్రచారం చేస్తున్నారు. కొత్తపేట మండలం అవిడి మండల ప్రజా పరిషత్ యూపీ పాఠశాల ఉపాధ్యాయుడు ఆలేటి దుర్గాప్రసాద్ పాఠశాలలకు సెలవులు ఇచ్చిన ఈ నెల 24 నుంచి గ్రామంలో పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించే బాధ్యతను చేపట్టారు. దానిలో భాగంగా ఇంటింటా తిరుగుతూ, మోటార్‌సైకిల్‌కు మైక్ కట్టుకుని ప్రచారం చేస్తూ చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారు. ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో ఒక స్కూలును మోడల్ స్కూల్‌గా ప్రకటించింది. దానిలో భాగంగా మండలంలోని అవిడి గ్రామానికి సంబంధించి ప్రధాన గ్రామంలో గతం నుంచి ఎంపీపీ యూపీఎస్‌గా ఉన్న పాఠశాల ఈ విద్యాసంవత్సరం మోడల్ స్కూల్‌గా గుర్తించారు. ఆ పాఠశాలలో కనీసం 50 మంది పిల్లలు ఉండి తీరాలి. ఈ పాఠశాలలో ఒకటి నుంచి 5 తరగతులు ఉండగా ప్రతి తరగతికి ఒక టీచర్ చొప్పున ఐదుగురు ఉపాధ్యాయులు ఉంటారు. అయితే గడచిన విద్యా సంవత్సరం 34 మంది పిల్లలు ఉండగా ప్రస్తుతం ఐదో తరగతి పరీక్షలు రాసిన 12 మంది విద్యార్థులు అదే గ్రామంలో జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఆరో తరగతికి వెళ్లిపోగా ఇక 22 మంది మాత్రమే ఉన్నారు. మోడల్ స్కూల్ నిబంధనల ప్రకారం కనీసం 50 మందికి ఇంకా 28 మంది పిల్లలు ఈ పాఠశాలలో చేరాల్సి వుంది. అందుకు ఆ పాఠశాల ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ ప్రచారం నిర్వహిస్తున్నారు. ఈ గ్రామీణ ప్రాంతంలో దాదాపు అందరూ పేద, మధ్యతరగతి కుటుంబాల వారే. మీ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పిస్తే విద్యాధికులైన ఉపాధ్యాయుల విద్యాబోధన, వివిధ ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతాయి. అన్ని సౌకర్యాలు ఉంటాయి. ఏ విధమైన ఆర్థిక భారం ఉండదు. మీ పిల్లలకు ఉన్నత భవిష్యత్ కల్పిస్తాం. అని భరోసా ఇస్తున్నారు. అలా 10 మంది పేరెంట్స్ నుంచి తమ పిల్లలను తన పాఠశాలలో చేర్పించేందుకు విల్లింగ్ తీసుకున్నారు. అవసరమైన మిగిలిన పిల్లలను కూడా చేర్పించేందుకు పట్టుదలతో కృషి చేస్తున్నారు. ఇలా తాను పనిచేసే ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే తన లక్ష్యమని ఉపాధ్యాయుడు దుర్గాప్రసాద్ అన్నారు.